క్లుప్తంగా

పుస్తక పఠనంతో విజ్ఞానం


అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్

సారవకోట: మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ స్మారక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంపై లైబ్రేరియన్ సాయమ్మ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పుస్తక పఠనంతో విజ్ఞానం కలుగుతుందన్నారు. సారవకోట గ్రామం నుంచి పలువురు విద్యార్థులకు గ్రంథాలయంలో ఉన్న పలు విజ్ఞాన శాస్త్ర, కథల, ఇతిహాసాలకు సంబంధించిన పుస్తకాలపై చదవడం మాకిష్టం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. పుస్తక పఠనంలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి


గురుగుబెల్లి శ్రీనివాసరావు

ఆమదాలవలస రూరల్: కృష్ణాపురం పీఏసీఎస్‌లో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు ఆదివారం తెలియజేశారు. రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 28వ తేదీలోగా 7 శాతం వడ్డీతో రెన్యువల్ చేసుకోవచ్చునని సూచించారు. రైతులు వన్-బీ ఒరిజినల్, ఆధార్, రేషన్, పాస్‌పుస్తకం జిరాక్స్‌లు, మూడు పాస్ ఫొటోలు, బ్యాంకు ఖాతా జిరాక్స్ తీసుకుని కార్యాలయం పని వేళల్లో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 28 తరువాత 13 శాతం అపరాధ రుసుంతో రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


సత్సంగంలో పాల్గొన్న ఆధ్యాత్మికవేత్తలు

సారవకోట: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, గ్రామాల్లో ఆధ్యాత్మిక సత్సంగాలు నిర్వహించాలని నరసింహ స్వామి అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్య జీవన సమాజం ఆధ్వర్యంలో 90వ ఆధ్యాత్మిక సత్సంగం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక సత్సంగాలు చేపట్టడంతో హిందూ ధర్మ ప్రచారం పూర్తిస్థాయిలో జరుగుతుందన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మికత పెరిగితే ఈర్ష్యా, ద్వేషాలు తగ్గుతాయని, దీంతో సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. నిత్యానంద స్వామి, అల్లు రామయ్య, సోమేశ్వరరావు, వెంకటరమణ, మోహనరావు తదితరులు పలు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

తమ్మినేనికి డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న రవిబాబు

జలుమూరు: చల్లవానిపేటకు చెందిన తమ్మినేని రవిబాబు సాహిత్య రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌కు న్యూలైఫ్ థియోలాజికల్ యానివర్సిటీ చెందిన డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జోషప్ రవిబాబుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. వర్సిటీ ప్రతినిధి లీలావతి, ప్రముఖులు పాల్గొన్నారు.

చిన్నారికి చేదోడుతో రక్షణ


విద్యార్థినులతో మాట్లాడుతున్న మండల కో ఆర్డినేటర్ రాజారావు

పాతపట్నం: తల్లిదండ్రులకు దూరంగా చదువుతున్న విద్యార్థినులకు చిన్నారి చేదోడు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని మండల కో ఆర్డినేటర్ నల్లి రాజారావు అన్నారు. బొమ్మిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో చిన్నారికి చేదోడు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థినులు తింటున్న అల్పాహారాన్ని పరిశీలించారు. పాఠశాల డార్మిటరీని, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ మాట్లాడుతూ విద్యార్థినులకు ఏ సమస్య వచ్చినా వెంటనే తమకు తెలియజేయాలన్నారు. నీతిని గ్రహించాలని, చేడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెచ్ఎం రాజ్యలక్ష్మి, కానిస్టేబుల్ జీవన్, సిబ్బంది పాల్గొన్నారు.

బడి మారింది

- నాడు-నేడుతో మహర్దశ
- రూపురేఖలు మారిన ప్రభుత్వ పాఠశాలలు

మండలం పేరు	ఆమదాలవలస
పాఠశాల పేరు	మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల
పంచాయతీ పేరు	చిట్టివలస
గ్రామం	గుంటవానిపేట
నాడు-నేడు నిధులు	రూ.14.49 లక్షలు



నేడు ఆహ్లాదకరంగా ఉన్న గుంటవానిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల



ఆమదాలవలస రూరల్:

ఆమదాలవలస మండలం చిట్టివలస గ్రామ పంచాయతీ గుంటవానిపేట గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గతంలో విద్యార్థులు చదువుకోవడానికి వీలులేకుండా ఉండేది. వర్షం వస్తే పాఠశాల ఆవరణం నీటితో నిండిపోయేది. అలాంటి పాఠశాల వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చిన తర్వాత రూపురేఖలే మారిపోయాయి. పక్కా భవన నిర్మాణాలతో పాటు స్కూల్‌లో విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా బల్లలు, రాసుకోవడానికి బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లతోపాటుగా ఆడుకోవడానికి స్కూల్‌లోనే గ్రౌండ్ ఉంది. గతంలో స్కూల్‌కు ప్రహరీ లేకపోవడం వల్ల రాత్రి వేళ పశువులు పడుకునేవి. ఇప్పుడు స్కూల్‌కు ప్రహరీ నిర్మించడంతో చదువుకోవడానికి, పిల్లలు ఆడుకోవడానికి ఇష్టపడుతున్నారు. నాడు-నేడు పథకం ద్వారా స్కూల్ రూపురేఖలు పూర్తిగా మారాయి. దీంతో పిల్లలు ఆహ్లాద వాతావరణంలో చదువులు కొనసాగిస్తున్నారు.


నాడు గుంటవానిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

సిద్ధం సభతో నూతన ఉత్తేజం

- సీఎం జగన్ అభిమాన 'జన' సముద్రంలో విపక్షాలు కొట్టుకుపోవటం ఖాయం
- శిష్టకరణ, కళింగవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లు సదాశివుని కృష్ణ, ట్యూరు సాయిప్రసాద్


మాట్లాడుతున్న శిష్టకరణ, కళింగవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు

పోలాకి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భీమిలిలో ఎన్నికల శంఖారావం పూరించి, ఉత్తరాంధ్రలో నిర్వహించిన సిద్ధం సభతో వైఎస్సార్‌సీపీ కేడర్‌లో నూతన ఉత్తేజం కలిగిందని రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ అన్నారు. పోలాకిలో మండల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, రాష్ట్ర కళింగవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పొట్నూరు సాయిప్రసాద్‌లతో కలిసి ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. సింగివలస సభ ద్వారా ఎన్నికల ముందే వైఎస్సార్‌సీపీ బలమేంటో సీఎం జగన్ చూపించారని, జగనన్న అభిమాన జన సముద్రంలో విపక్షాలు కొట్టుకుపోవటం ఖాయమని తేలిపోయిందన్నారు. చాలామంది కార్యకర్తలు, నాయకులు సభ నుంచి తిరుగుప్రయాణంలోనే తమ సంసిద్ధత వ్యక్తపరుస్తూ ఎన్నికల రంగంలోకి దూకేందుకు 'సిద్ధం' అనే నినాదాన్ని తమ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల వద్ద వెల్లడించారన్నారు. ముఖ్యంగా పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన ప్రజలు ఎన్నికలు ఎప్పుడొస్తాయా అని ఎదురు చూస్తున్నారని తెలిపారు. తమకు ఇంతటి సంక్షేమాన్ని అందించిన నాయకుడికి అండగా ఉండేందుకు తాము 'సిద్ధం'గా ఉన్నామన్నారు. వారు క్షేత్రస్థాయిలో చెబుతున్న తీరు చూస్తే జగనన్న చెప్పిన టార్గెట్ 175ను వైఎస్సార్‌సీపీ కచ్చితంగా సాధించి తీరుతుందన్నారు. జిల్లాలో పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ నేతృత్వంలో అన్ని నియోజకవర్గాల్లో వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు సమక్షంలో ఉధృతంగా ప్రచారం చేస్తామని ప్రకటించారు. నరసన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే కృష్ణదాస్, బీసీ సెల్ రీజనల్ కో ఆర్డినేటర్ ధర్మాన కృష్ణచైతన్యల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధికి విపక్షాలు పోటీ ఇవ్వకుండానే చతికిల పడిపోయేలా ఉన్నాయని కార్పొరేషన్ డైరెక్టర్లు పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రూ.4.20 కోట్లతో సీహెచ్‌సీ అభివృద్ధి
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ఐసోలేషన్ వార్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ)లో రూ.4.20 కోట్ల నాబార్డు నిధులతో నాడు-నేడులో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా సీహెచ్‌సీలో మొదటి ఫ్లోర్‌లో ఐసోలేషన్ వార్డు, సూపరింటెండెంట్ గది, రికార్డుల భద్రపర్చు గది, వెయిటింగ్, మీటింగ్ హాల్, హెడ్ నర్సు గది, కార్యాలయం, నర్స్ స్టేషన్ నిర్మాణం చేపట్టారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉన్నారని, వారి సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఎంఈఈ సత్యప్రభాకర్, సూపరింటెండెంట్ సురేంద్రబాబు, ఎంపీపీ దొర సావిత్రిమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునరావు, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అప్పన్న, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, ఆస్పత్రి డైరెక్టర్లు కర్రి రజిని, ఎం.వరదరాజు, ఎస్ఎంఎస్ఈ డైరెక్టర్ వెంకటరమణ, పార్టీ నాయకుడు పనుకు మోహన్ పాల్గొన్నారు.

మేమున్నామని..

- స్నేహితులకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న పూర్వవిద్యార్థులు

హిరమండలం: తోటివారు కష్టాల్లో ఉన్నప్పుడు సాయపడడం ప్రాథమిక కర్తవ్యం. అటువంటి సంకల్పాన్ని, తెగువను చూపిస్తున్నారు హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు. 1991 నుంచి 1996 మధ్య 6 నుంచి పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 2018లో రాక్‌బ్యాచ్ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తమతో చదువుకున్నవారు కష్టాల్లో ఉంటే వారికి అండగా నిలవాలని బలంగా సంకల్పించారు. సొంతంగా నిధులు పోగు చేసుకుంటున్నారు. పూర్వ విద్యార్థుల సంఘంలో ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజినీర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ రంగాల్లో స్థిరపడినవారు ఉన్నారు. ఎవరి స్థాయికి తగినంత వారు విరాళాలు అందిస్తున్నారు. పాఠశాలలో బీరువాలు, ఫర్నీచర్‌కు రూ.లక్ష వరకు సాయమందించారు. గొర్లె జగదీష్ అనారోగ్యానికి గురికావడంతో 2018లోనే రూ.20 వేల నగదు అందించారు. అప్పటి నుంచి ప్రతి నెలా మందుల కోసం రూ.3 వేల వంతున సాయం అందిస్తున్నారు. కళింగపట్నం గురనాథం క్యాన్సర్‌తో బాధపడుతుండగా.. ఆయనకు రూ.36 వేలు అందించారు. ఇటీవల ఆయన పరిస్థితి విషమమంగా మారడంతో ఆదివారం వైద్య ఖర్చుల కోసం రూ.50 వేలు అందజేశారు. క్యాన్సర్ బారినపడిన బెవర సాయికి వైద్య ఖర్చులకు రూ.60,700లను అందించారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు చెబుతున్నారు. తోటివారికి సాయం చేస్తున్న పూర్వ విద్యార్థుల సంఘానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం


ల్యాప్‌టాప్, ప్రింటర్ చూపిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కొత్తూరు: ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ నిరంతరంగా పోరాటం చేస్తోందని సంఘం జిల్లా ప్రతినిధి ఎస్.శాంతారావు అన్నారు. కొత్తూరు ప్రాథమిక పాఠశాల-2లో ఏపీటీఎఫ్ కొత్తూరు మండల శాఖ సబ్ కమిటీ సమావేశాన్ని మండల శాఖ అధ్యక్షుడు గణపతిరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలతోపాటు పలు డిమాండ్ల సాధన కోసం ఏపీటీఎఫ్ ఐక్య పోరాటాలు చేస్తోందన్నారు. మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మరింత మెరుగైన సేవలు అందించాలన్న ఆలోచనతో మండల శాఖకు ల్యాప్‌టాప్, ప్రింటర్‌ను శాంతారావు అందించారు. మండల శాఖ కార్యదర్శి బాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడు జి.సోమేశ్వరరావు, మండల శాఖ నాయకులు వై.సత్యనారాయణ, ఎల్.గోవర్ధనరావు, కె.రాజారావు, జి.సీతారాం, ఎం.లోకేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

88 శాతం కుల గణన పూర్తి

కొత్తూరు: మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలో గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు సంయుక్తంగా నిర్వహిస్తున్న కుల గణన సర్వే చేపడుతున్నారు. ఆదివారం నాటికి 88 శాతం పూర్తిచేసినట్లు ఈఓపీఆర్డీ కృష్ణారావు తెలిపారు. మండలంలోని 24,123 కుటుంబాల్లో 70,526 మంది జనాభా ఉన్నట్లు చెప్పారు. ఇంతవరకు 21,132 కుటుంబాల్లో 55,884 మంది వివరాలు నమోదు చేశామన్నారు. గత తొమ్మిది రోజుల సర్వే బృందాలు వివరాలు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. సర్వే పారదర్శంగా నిర్వహించేందుకు సర్వే బృందాలను ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నామన్నారు. వసల వెళ్లిన కుటుంబాల వివరాలు నమోదు చేసేందుకు కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఉన్నట్లు చెప్పారు. సాంకేతిక ఇబ్బందులను తొలగించి శత శాతం సర్వే పూర్తి చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నట్లు తెలిపారు.

లో ఓల్టేజీ సమస్యకు చెక్


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

పొందూరు: స్థానిక అఫిషియల్ కాలనీ వాసులకు గత కొన్నేళ్లుగా పట్టి పీడిస్తున్న విద్యుత్‌లో ఓల్టేజీ సమస్యకు ప్రభుత్వం చెక్ పెట్టింది. విద్యుత్ శాఖ ఏఈ వీరభద్రస్వామి ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

200 మందికి వైద్య సేవలు

ఆమదాలవలస రూరల్: బెలమాం గ్రామంలో శ్రీకాకుళం సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామంలో సుమారు 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఆరోగ్య నియమాల గురించి వైద్యులు బొడ్డేపల్లి సురేష్ వివరించారు. ప్రతిరోజూ వ్యాయామం, యోగా వంటివి పాటిస్తే ఆరోగ్య సమస్యలు రాకుండా నివారించవచ్చునని తెలియజేశారు. సర్పంచ్ కణుగుల కిశోర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో 75వ గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బలగ లయన్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 26 మంది రక్తదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ.. రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ బడాన దేవభూషణరావు, బ్లడ్ బ్యాంకు మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి


విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- ముగిసిన నియోజవకర్గ ఆడుదాం- ఆంధ్రా క్రీడా పోటీలు

పాతపట్నం: గ్రామ స్థాయి క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిద్దిడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్‌లో గెలిపొందిన క్రీడాకారులకు మెమొంటోలు, సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందించారు. నియోజకవర్గ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన క్రీడాకారులకు రూ.35 వేలు, రెండో స్థానానికి రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేల బహుమతి ఉంటుందని, క్రీడాకారుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం ఈ మొత్తం జమ చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

గెలిపొందిన క్రీడాకారులు..

బ్యాడ్మింటన్ స్త్రీల విభాగంలో కొత్తూరు మండలం ప్రథమ, మెళియాపుట్టి మండలం ద్వితీయ, పాతపట్నం మండలం తృతీయ స్థానాల్లో నిలిచాయి. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో పాతపట్నం ప్రథమ, కొత్తూరు ద్వితీయ, మెళియాపుట్టి తృతీయ స్థానాల్లో సత్తాచాటారు. క్రికెట్-పురుషుల విభాగంలో కొత్తూరు ప్రథమ, ఎల్.ఎన్.పేట ద్వితీయ, హిరమండలం తృతీయ స్థానం పొందారు. కబడ్డీ-స్త్రీల విభాగంలో మెళియాపుట్టి మొదటి, పాతపట్నం, రెండు, కొత్తూరు మూడో స్థానం సాధించారు. కబడ్డీ పురుషుల విభాగంలో హిరమండలం ప్రథమ, కొత్తూరు ద్వితీయ, ఎల్.ఎన్.పేట తృతీయ స్థానాల్లో నిలిచారు. ఖో ఖో - స్త్రీల విభాగంలో మెళియాపుట్టి మొదటి, ఎల్.ఎన్.పేట రెండు, పాతపట్నం మూడో స్థానంలో నిలిచి సత్తాచాటారు. ఖో ఖో - పురుషుల విభాగంలో మెళియాపుట్టి మొదటి, పాతపట్నం రెండు, హిరమండలం మూడో స్థానంలో నిలిచాయి. వాలీబాల్-స్త్రీల విభాగంలో మెళియాపుట్టి ప్రథమ స్థానంలో నిలిచింది. వాలీబాల్-పురుషుల విభాగంలో మెళియాపుట్టి ప్రథమ, ఎల్.ఎన్.పేట ద్వితీయ, హిరమండలం తృతీయ స్థానాల్లో నిలిచి సత్తాచాటారు. ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, కొత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు కె.భాగ్యలక్ష్మి, మండల సలహాదారుడు ఎం.గణపతిరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ తాతయ్య, దేవాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ మంచు చంద్రయ్య, హెచ్ఎం సింహాచలం, నాయకులు పంకజ్ దాస్, కె.లక్ష్మీనారాయణ, సర్పంచ్ ఉమ, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం


పోలాకి: రహదారి పనులను ప్రారంభిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య


నరసన్నపేట: రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ శంకరరావు

పోలాకి: పిన్నింటిపేట నుంచి అంబీరుపేట వరకు తారురోడ్డు పునరుద్ధరణ పనులను పోలాకి జెడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఆదివారం ప్రారంభించారు. కళింగపేటల రహదారుల అనుసంధానంతోపాటు ఉప్పుగెడ్డపై వంతెనల నిర్మాణం తదితర పనులపై అక్కడి నాయకులతో మాట్లాడారు. వీలైనంత తొందరలో ఈ పనులు పూర్తిచేస్తామన్నారు. తీరప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, వచ్చే ఏడాది నాటికి రాజారాంపురం తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, ఆర్అండ్‌బీ డీఈఈ తిరుపతిరావు, ఏఈ సరోజ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ నాయకులు చింతు సింహాచలం, చింతాడ వెంకటరావు, సాలిన నగేష్‌కుమార్, గురివెల్లి అప్పారావు, రెంటికోట త్రినాథరావు, చింతాడ భీమారావు, కూన ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నెయ్యిల వీధిలో..

నరసన్నపేట: మండల కేంద్రంలోని నెయ్యిల వీధిలో రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బుర్లి శంకరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణానికి పంచాయతీ నుంచి రూ.2 లక్షలు మంజూరు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. వైస్ ఎంపీపీ పాగోటి రాజారావు, మాజీ ఉప సర్పంచ్ పొట్నూరు కృష్ణప్రసాద్, వార్డు సభ్యుడు ముద్దాడ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభతో ప్రతిపక్షాల్లో వణుకు


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ

- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం
- పీఏసీఎస్ చైర్మన్ సూర్యనారాయణ

కొత్తూరు: విశాఖ జిల్లా భీమిలి వేదికగా 2024 సార్వత్రిక ఎన్నికల శంఖారావాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూరించడంతో ప్రతిపక్షాలకు వణుకు పట్టుకుందని కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. మెట్టూరులో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. సిద్ధం సభకు అశేష జవాహిని హాజరుకావడంతో పార్టీ శ్రేణుల్లో ఎన్నికల ఉత్సాహం ఉప్పొంగిందన్నారు. సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఇంత పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్లు హాజరుకావడంతో జన సంద్రంగా మారిందన్నారు. పాతపట్నం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరైనట్లు చెప్పారు. సర్పంచ్‌లు పెదకోట సాదుబాబు, యర్లంకి ధర్మారావు, గంధవరపు నాగేంద్ర, నక్క వెంకటరావు పాల్గొన్నారు.

కళ్లను రక్షించుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కళ్లు దేవుడిచ్చిన అపురూపమైన నిధి అని, వాటిని జాగ్రత్తగా చూసుకోవడం మనవిధి అని నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. పట్టణంలోని రైతుబజార్ వద్ద లయన్స్‌క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఎల్లప్పుడూ ముందుండే హారిక ప్రసాద్ అందరికీ ఆదర్శంగా నిలిస్తున్నారన్నారు. స్థాపించిన రెండేళ్లలోనే లయన్స్‌క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. ప్రజావసరాలను గుర్తించి, వాటిని అందించడంలో, పేద విద్యార్థులను ఆదుకోవడంలో, పర్యావరణ హితమైన కార్యక్రమాలు నిర్వహించడంలో లయన్స్‌క్లబ్ పాత్ర కీలకమైందని చెప్పారు. దినేష్ కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ దినేష్ కాంత్ మాట్లాడుతూ.. కంటి సమస్యను నిర్లక్ష్యం చేయకూడదన్నారు.